క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న జే.లలితమ్మ

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ ఎంప్లాయీస్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలుకు వచ్చిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు మెస్ చార్జీలను పెంచాలని, సకాలంలో బిల్లులు ఇవ్వాలని కనీస వేతనం రూ.28 వేలకు పెంచాలని కోరినట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చౌడేశ్వరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పార్వతి పాల్గొన్నారు.

పార్వతిబాయ్ పోరాటానికి కేవీపీఎస్ మద్దతు



పార్వతిబాయ్ దీక్షకు మద్దతు తెలుపుతున్న శ్రామిక మహిళ, కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సుగాలి ప్రీతీబాయ్ తల్లి పార్వతిబాయ్ చేపట్టిన పోరాటానికి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల ఆధ్వర్యంలోని బృందాలు మద్దతు ప్రకటించాయి. బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం ఆమె చేపట్టిన దీక్షకు వారు మద్దతు తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి కేసును పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే సుగాలి ప్రీతీబాయ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

వైద్యసేవల్లో లోటుపాట్లు ఉండరాదు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, డీఎంఈ రఘునందన్

కర్నూలు(హాస్పిటల్): వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని ప్రధాన మంత్రి పర్యటన స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ ఆదేశించారు. సూపర్ జీఎస్టీ సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. విద్యుత్ సౌకర్యాలు, వైద్య పరికరాలు, తాగునీటి సదుపాయం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా వైద్య బృందం తరఫున ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. డీఎంఈ డాక్టర్ రఘునందన్, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డార్మెటరీ నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

కర్నూలు (అర్బన్): నగరంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలికల గురుకులం పక్కనున్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో డార్మెటరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. ప్రధాని పర్యటనలో భాగంగా కర్నూలుకు వచ్చిన ఆమె బుధవారం సాయంత్రం బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్మెటరీ సమస్యను మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. డార్మెటరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గిరిజన గురుకులాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మూడు పూటలా మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థినులు తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు టెలిఫోన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.సురేష్, కార్యాలయ పర్యవేక్షకులు మునిచంద్ర, గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ పోలీసు!

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామనగర్‌లో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది పోలీసే అని తెలిసి అందరూ అవాక్కయ్యారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస ఆచారి గత కొద్ది నెలలుగా విధులకు సరిగా హాజరుకాక సిక్ లీవ్‌లో ఉంటూ మద్యానికి బానిసైనట్లు తెలిసింది. మద్యం మత్తులో ఈ నెల 14వ తేదీ రాత్రి మహిళ మెడలోని బంగారు గొలుసును లాగేస్తూ ప్రజలకు దొరికిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు పోలీసుపై పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు.

మత్తు మందు.. గమ్మత్తు

- నొప్పి తెలియకుండా ఆపరేషన్లు
- పెయిన్ క్లినిక్‌లకు పెరుగుతున్న ఆదరణ
- పెద్దాసుపత్రిలో పెయిన్‌లెస్ లేబర్, పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు
- ఏటా 30 వేలకు పైగా శస్త్రచికిత్సలు
- నేడు ప్రపంచ అనెస్తీషియా దినం



ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు



నడుముకు మత్తు ఇంజెక్షన్ ఇస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): శరీరంపై ఏదైనా చిన్నదెబ్బ తగిలినా, కింద పడి గీసుకుపోయినా నొప్పితో అల్లాడిపోతాం. అయితే శరీరాన్ని నిలువునా కోసి ఆపరేషన్ చేసినా ఎలాంటి నొప్పి ఉండదు. ఎందుకంటే ఆపరేషన్‌కు ముందు వేసే ఇంజెక్షన్ మహిమ అది. దీనినే వైద్య పరిభాషలో అనెస్తీషియా ఇంజెక్షన్ అంటారు. అవసరాన్ని బట్టి తగిన డోసులో ఇచ్చే ఈ మత్తు మందు వల్ల ఆపరేషన్ సమయంలో ఎలాంటి నొప్పి తెలియకుండా చేస్తుంది. దీని వల్ల ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించేందుకు వీలుకలుగుతుంది. ఈ నెల 16న ప్రపంచ అనెస్తీషియా దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసెచ్యూసెట్ ఆసుపత్రిలో విలియం థామస్ గ్రీన్ మోర్టన్ అనే వైద్యుడు 1846 అక్టోబర్ 16న 'డై ఇథైల్ ఈథర్' అనే త్వరగా ఆవిరయ్యే రసాయన ద్రవంతో 'గిల్‌బర్ట్ ఆబట్' అనే వ్యక్తి మెడలోని కణితిని నొప్పిలేకుండా, అతనికి ఎలాంటి ఇబ్బంది, ప్రాణాపాయం కలగకుండా తీయడంలో విజయవంతం అయ్యాడు. అప్పటి నుంచి ఆ ఆపరేషన్ చేసిన రోజును అనెస్తీషియా దినంగా నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనెస్తీషియా విభాగంలో మూడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తుండగా 39 మంది పీజీలు చదువుతూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ విభాగం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో 24 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వీటిలో ఏటా అన్ని రకాల శస్త్రచికిత్సలు నిర్వహించే విభాగాలు 30 వేలకు పైగా ఆపరేషన్లు చేస్తున్నాయి. దీంతో పాటు జిల్లా మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 170 మందికి పైగా మత్తు మందు వైద్యులు ఉన్నారు. వీరు ఆపరేషన్‌కు ముందు రోగికి నొప్పి తెలియకుండా మత్తు ఇంజెక్షన్ ఇస్తారు. ఆ తర్వాత ఆపరేషన్ సమయంలో, అనంతరం రోగి కోలుకునేంత వరకు దగ్గరుండి పరిరక్షిస్తూ వైద్య సేవలు అందిస్తారు.

ఐసీయూలో వీరిదే కీలక పాత్ర

కేవలం ఆపరేషన్ సమయంలో రోగికి మత్తు మందు ఇవ్వడం మాత్రమే అనెస్తీషియా పాత్ర కాదు. క్రిటికల్ కేర్ విభాగం (ఐసీయూ)లోనూ వీరు కీలకంగా వ్యవహరిస్తారు. రోగి ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు ప్రత్యేక పద్ధతిలో శరీరానికి అవసరమైన శక్తి అందేలా ఏర్పాట్లు చేస్తారు. రోగికి మత్తు మందు ఇవ్వడమే గాక అత్యవసర చికిత్సలో ప్రాణాలను కాపాడేందుకు కాయశక్తులా కృషి చేస్తారు.

పెయిన్ క్లినిక్‌లకు ఆదరణ

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా పెయిన్ క్లినిక్‌లకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో వివిధ రకాల నొప్పులు తగ్గిస్తామంటూ పలువురు అనెస్తెటిస్టులు పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలు (ఎక్స్‌రే మిషన్, సీటీ స్కానింగ్ మిషన్, అల్ట్రా సౌండ్ మిషన్, రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మిషన్)ను ఉపయోగించి కుట్లు లేని ప్రత్యేకమైన ఇంజెక్షన్ల ద్వారా నొప్పి తగ్గిస్తారు. నడుము, మోకాళ్లు, మెడ, తల, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేసి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తారు. ఇప్పుడు చాలా ప్రసవాలను నొప్పులు లేకుండా చేస్తున్నారు. దీనినే పెయిన్‌లెస్ లేబర్‌గా పిలుస్తున్నారు. ఇలాంటి విధానాన్ని ఇటీవల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో ప్రారంభించారు. అలాగే స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పెయిన్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు.

నొప్పులు లేకుండా ప్రసవాలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏటా 30 వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. వీటిలో 20 వేలు మేజర్, 10 వేలు మైనర్ ఆపరేషన్లు ఉంటాయి. ఇటీవల అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో ప్రసూతి విభాగంలో పెయిన్‌లెస్ లేబర్ (నొప్పులు లేకుండా ప్రసవాలు), క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పెయిన్ క్లినిక్‌లను ప్రారంభించాం. ఉచితంగా లభించే ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ రామశివనాయక్, ప్రొఫెసర్, అనెస్తీషియా విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఆపరేషన్ సమయంలో కీలకం



అనెస్తెటిస్ట్ లేకుండా ఆపరేషన్ అనేది ఊహకందదు. ఒక రోగికి ఏదైనా ఆపరేషన్ చేయాలంటే ముందుగా అనెస్తెటిస్ట్ వచ్చిన ఆ రోగిని పరిశీలించి ఫిట్‌గా ఉన్నాడని సర్టిఫై చేయాలి. ఆ తర్వాతే ఆపరేషన్ చేయడానికి ఏర్పాట్లు చేస్తాం. రోగికి మత్తు మందు ఇచ్చే సమయం నుంచి కోలుకునేంత వరకు అనెస్తెటిస్ట్ వైద్యులు అందించే పాత్ర చాలా ముఖ్యమైనది. అనెస్తీషియా ఇచ్చిన తర్వాత అపస్మారక/అచేతన స్థితిలో ఉన్న రోగికి సులభంగా, విజయవంతంగా ఆపరేషన్ చేయగలుగుతున్నాం.
– డాక్టర్ ఏ.ఎస్.భార్గవ వ్యాస్, జనరల్ సర్జన్, కర్నూలు

శరీర నిర్మాణ శాస్త్రంలో పట్టు సాధించాలి



వైద్య విద్యార్థులతో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు (హాస్పిటల్): యువ వైద్యులు శరీర నిర్మాణ శాస్త్రంలో పట్టు సాధిస్తే మంచి వైద్యులుగా రాణిస్తారని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. బుధవారం కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో 15వ ప్రపంచ అనాటమీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి వైద్యుడు మొట్టమొదటగా శరీర నిర్మాణ శాస్త్రాన్ని తెలుసుకుంటేనే వైద్య రంగంలో ముందుకు వెళ్లగలడన్నారు. ప్రపంచ ఆధునిక మానవ శాస్త్ర నిర్మాణ స్థాపకుడు ఆండ్రియాస్ వేసాలియస్ మరణించిన వారోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ అనాటమిస్ట్ 'గ్లోబల్ పర్‌స్పెక్టివ్స్ ఆఫ్ అనాటమీని' 2025 సంవత్సరం థీమ్‌గా ప్రకటించిందన్నారు. విద్యార్థులు ప్రత్యేకంగా శరీర అంతర్గత నిర్మాణాలను బాడీ పెయింటింగ్స్‌లో చూపిన విధానం బాగుందని కొనియాడారు. బాడీ పెయింటింగ్, శరీర అంతర్గత భాగాల ఆర్ట్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, కమ్యూనిటీ విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్‌కుమార్, పీజీ డాక్టర్ రషీద్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, సీమకు ప్యాకేజీ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): విభజన చట్టంలోని ప్రతిపాదనల మేరకు ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ.సూర్య ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టంలో ఉన్నా రాష్ట్రానికి ప్రత్యేక హోదాను మోదీ తొక్కిపెట్టారన్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఏడాదికి రూ.50 కోట్ల ప్రకారం రెండేళ్లు ఇచ్చి చెయ్యి దులుపుకున్నారని విమర్శించారు. ఈ క్రమంలో ఏపీకి వస్తున్న ప్రధానిపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విభజన హామీల అమలుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలను నయవంచన చేసి జీఎస్టీ పేరుతో సంబరాలు చేసుకోవడం తగదన్నారు. కర్నూలులో ఉల్లి, టమోటా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఓట్ చోర్‌పై సంతకాల సేకరణ

కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని 40వ వార్డులో ఓట్ చోర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కోడుమూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి అనంతరత్నం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మీ నరసింహ యాదవ్, కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు హాజరై ఎన్నికల్లో బీజేపీ గిమ్మిక్కులను ప్రజలకు వివరించారు.

యువత కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తదితరులు

కర్నూలు కల్చరల్: యువత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో డాక్టర్ అబ్దుల్ కలాం 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన మాధవ్ మాట్లాడుతూ కలాం కలలను సాకారం చేయడం యువత లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, డీన్ అక్తర్ భాను, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, సయ్యద్ బాష, సునీల్ రెడ్డి, పనతల సురేష్ పాల్గొన్నారు.

ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం వర్సిటీలో నిర్వహించిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఎంజీవీకే పథకం ద్వారా వర్సిటీకి రూ.100 కోట్లు నిధులు మంజూరయ్యేలా సహకరించాలని వీసీ షావలిఖాన్ ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. రిజిస్ట్రార్ వి.లోకనాథ, ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా ఉన్నారు.

శ్రేష్ట విద్యార్థులకు న్యాయం చేయాలి

కర్నూలు కల్చరల్: శ్రేష్ట విద్యార్థుల స్థానికత అంశంపై విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ శాఖల మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీల ఉచిత విద్య పథకం శ్రేష్ట ద్వారా ఇతర రాష్ట్రాల్లో చదివిన షెడ్యూల్డు కులాల విద్యార్థులను స్థానికులుగా పరిగణించి జీఓ ఎంఎస్ నంబర్ 20 నుంచి మినహాయింపునిస్తూ 9 నుంచి 12వ తరగతి వరకు ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, హాస్టల్ వసతులు కల్పించాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, సభ్యులు ప్రకాష్, రాజు, నరసింహులు, మద్దయ్య మంత్రులను కలసిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కర్నూలు కల్చరల్: జిల్లాలో బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025 జూన్‌లో బదిలీ పొంది నూతన స్థానంలో జాయిన్ అయిన ఉపాధ్యాయుల పాత స్థానాల్లో టీచర్లు రాకపోవడంతో నూతన డీఎస్సీ పూర్తయి ఉపాధ్యాయులు వచ్చే వరకు డిప్యూటేషన్‌పై పాతస్థానంలోనే పనిచేయాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా బదిలీ పొంది నాలుగు నెలలు దాటినా పాత స్థానంలోనే కొందరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినప్పటికీ చాలా స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవర్ వచ్చే వరకు అక్కడే పని చేయాలనడం సమంజసం కాదన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

కర్నూలు (హాస్పిటల్): చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ వై.మహేశ్వర్ రెడ్డి చెప్పారు. ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. చేతుల శుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సరైన పద్ధతిలో చేతులు కడగటం అలవాటు చేసుకోవాలన్నారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్ జోక్యంతో విద్యార్థికి సర్టిఫికెట్లు

కర్నూలు(సెంట్రల్): కర్నూలుకు చెందిన సయ్యద్ సాహిల్ 2023లో నంద్యాలలోని శాంతిరామ్ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్ఈడీఎస్ కోర్సులో చేరాడు. అతను కోర్సు ప్రారంభం సందర్భంగా నిబంధనల మేరకు రూ.70 వేల ట్యూషన్ ఫీజు, రూ.25 వేల హాస్టల్ ఫీజు కాలేజీకి చెల్లించారు. అయితే తరువాత సంవత్సరం నుంచి ఆయన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కాలేజీకి వెళ్లలేదు. ఈ క్రమంలో కాలేజీలో ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం వెళ్లితే మిగతా సంవత్సరాలకు సంబంధించి ఫీజు రూ.2.50 లక్షలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యం చెప్పడంతో బాధితుడు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ క్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు ప్రతిపాదులకు నోటీసులు ఇచ్చి ఇద్దరిని రాజీ చేయడంతో బాధితుడికి కాలేజీ యాజమాన్యం గురువారం సర్టిఫికెట్లను అందజేసింది.

పీఎం సభకు 14 వైద్య బృందాలు

కర్నూలు (హాస్పిటల్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం పాల్గొననున్న సూపర్ జీఎస్టీ సభకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి 14 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. సభాస్థలి వద్ద వీవీపీల కోసం ఏర్పాటు చేసిన 10 పడకల ఆసుపత్రితో పాటు 20 పడకల ఆసుపత్రి, పలు చోట్ల ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల వద్ద వీరు విధులు నిర్వహించనున్నారు. ఇందులో ప్రత్యేకంగా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు వైద్య బృందాలను నియమించారు. ఒక్కో వైద్య బృందంలో 10 నుంచి 12 మంది దాకా వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది ఉన్నారు. వైద్యుల్లో సూపర్ స్పెషలిస్టులతో పాటు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, అనస్తీషియా, చిన్నపిల్లల వైద్యులు సైతం ఉన్నారు. మొత్తంగా 50 మందికి పైగా వైద్యులు, 100 మందికి పైగా సిబ్బంది ఆసుపత్రి నుంచి తరలివెళ్లడంతో కీలకమైన విభాగాల వైద్యులు, సిబ్బంది లేకుండా పోయారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధి, ప్రతి జిల్లాలో మోడల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఏపీ రాష్ట్ర పౌర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఓల్డ్‌సిటీలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను ఆయన సందర్శించారు. వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమరావతిలో ఐదెకరాల్లో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.150 కోట్లతో రెండేళ్లలో అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం చేపట్టనున్నామన్నారు. గ్రంథాలయాల్లో ఉద్యోగార్థులు, పాఠకులకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల్లోనే చదువుకొని 360 మంది టీచర్, 350 మంది పోలీస్ ఉద్యోగాలు సాధించారన్నారు. గ్రంథాలయాల సెస్ నేరుగా గ్రంథాలయాల అకౌంట్‌కు జమ అయ్యేలా పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల మంత్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠకుల అభిరుచికి అనుగుణంగా గ్రంథాలయాలను తీర్చి దిద్దుతామన్నారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ ఆధ్వర్యంలో చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, సీనియర్ అసిస్టెంట్ మక్బుల్ బాష తదితరులు పాల్గొన్నారు.

కలాం జీవితం యువతకు ఆదర్శం



జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో కలాం చిత్రపటానికి నివాళి



బీక్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో..

కర్నూలు కల్చరల్: భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయా విద్యా సంస్థల అధినేతలు, అతిథులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త కలాం అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. అణు పరిశోధనలో విశేష సేవలు అందించి 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఘనతకెక్కారన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన వేడుకల్లో ఏపీ రాష్ట్ర పౌర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, సీనియర్ అసిస్టెంట్ మక్బుల్ బాష, తదితరులు పాల్గొన్నారు. బీక్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు విజయశేఖర్, మల్లికార్జున, జబీన్ అక్తర్, సోమేష్, సుజాత, లక్ష్మి, గిరిజారాణి, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు. ఏక్యాంప్ మైపర్ ఫార్మసీ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్, అధ్యాపకులు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఏక్యాంప్ మైపర్ ఫార్మసీ కళాశాలలో..

పీఎం పర్యటన కోసం విద్యాసంస్థలకు సెలవులా?

కర్నూలు(సెంట్రల్): ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లాకు వస్తున్న సందర్భంగా విద్యా సంస్థలకు ఒకరోజు ముందుగానే సెలవులు ఇవ్వడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా విమర్శించారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఓర్వకల్ మండలం నన్నూరుకు ప్రధాని వస్తుంటే జిల్లా అంతటా పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ఇవ్వడం అన్యాయమన్నారు. పాఠశాలల బస్సుల్లో జనాలను ప్రధాని సభకు తరలిస్తుండటంతోనే విద్యార్థులకు సెలవులు ఇచ్చారని మండిపడ్డారు. నాయకులు శరత్‌కుమార్, అశోక్, మునిస్వామి, దేవా ఉన్నారు.

కేసు నమోదు

ఆదోని రూరల్: ఈనెల 7వ తేదీన మండలంలోని దిబ్బనకల్ గ్రామంలో పొలం రస్తా విషయంలో గుజ్జల జయలక్ష్మి అనే మహిళను కులం పేరుతో దూషించి తిట్టినందుకు కురువ శివరాజు, కురువ అఖండమ్మ, కురువ రాజమ్మ, కురువ వన్నమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఆదోని రూరల్ సీఐ నల్లప్ప తెలిపారు. అలాగే పొలం రస్తాలో కురువ వన్నమ్మను కొట్టారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. జయలక్ష్మి, హరిజన అంజినయ్య, ఈరమ్మలపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.